కడుపు కొడుతున్నారు





- సక్రమంగా అందని పౌష్టికాహారం
- బక్కచిక్కుతున్న చిన్నారులు
- బలహీనపడుతున్న బాలింతలు
- మెనూకు తిలోదకాలు
- కక్కుర్తి పడుతున్న కాంట్రాక్టర్లు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అయితే అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై వీరి కడుపు కొడుతున్నారు. పాలు, అదనపు పౌష్టికాహారం కింద అందించే కిట్లలో సైతం అడ్డదారిలో దోచేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ఆ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కొందరు అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిసింది. ఏది ఏమైనా అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల నిర్వాహకంతో ఆయా లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది.

నంద్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల కడుపు కొడుతున్నారు. కాంట్రాక్టర్లు నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. గుడ్ల సైజు సైతం తగ్గించేసి మమ అనిపించేస్తున్నారు. చిన్నారులు బక్క చిక్కిపోతున్నారు. అలాగే బాలింతలు, గర్భిణులు బలహీనపడిపోతున్నారు. చాలా కేంద్రాల్లో ఇటీవల పంపిణీ పరంగా పరిశీలిస్తే ఖర్జూరం సైతం బూజుతో ఉండటమే ఇందుకు నిదర్శనం. మొత్తంగా అధికారులు పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్లు అదనుగా భావిం చారు. పౌష్టికాహా రం పంపిణీలో తమదైన శైలిలో చేతివాటం ప్రద ర్శించి సొమ్ము చేసుకుంటున్నా రనే విమర్శలు లేకపోలేదు.

తమదైన శైలిలో చేతివాటం

అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, గుడ్లు తదితర వాటిలో కాంట్రాక్టర్లు తమ దైన శైలిలో చేతివాటం ప్రదర్శిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పాలు, అదనపు పౌష్టికాహారం కింద అందించే కిట్లులో సైతం అడ్డదారిలో దోచేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. లబ్ధిదారులకు అందించే చిక్కిలు, రాగిపిండి, బెల్లం, ఖర్జూరం, అటుకుల పంపిణీలో సైతం నాసిరకంగా సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆ వర్గాల నుంచి తెలిసింది. బియ్యం, కందిపప్పు, వంట నూనె, పాలు సైతం సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలకు చేరడం లేదనే ఆరోపణలు జిల్లాలో లేకపోలేదు. ఇవన్నీ తెలిసినా ఆశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావి స్తోంది. కొందరు అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిసింది.

జిల్లాలో పరిస్థితి ఇలా....

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	: 06
అంగన్‌వాడీ కేంద్రాలు	: 1663
బాలింతలు	: 7887
గర్భిణులు	: 10,757
చిన్నారులు	: 1,19,831
మొత్తం లబ్ధిదారులు	: 1,38,475మంది

1,663 అంగన్‌వాడీ కేంద్రాల్లో..

జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1663 అంగన్‌వాడీలు కేంద్రాలున్నాయి. 1,38,475 మంది లబ్ధిదారులు ఉన్నారు. బాలింతలు, గర్భిణులకు నెలకు ఐదు లీటర్లు, 25 కోడిగుడ్లు, బియ్యం, కందిపప్పు, నూనె, వీటితో పాటు అటుకులు-1 కేజీ, రాగిపిండి- 1 కేజీ, ఖర్జూరం, చిక్కి, బెల్లం- 250 గ్రాములు ఇవ్వాల్సి ఉంది. మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం- 2.50 కేజీ, కోడిగుడ్లు-30, పాలు- 2.50 లీటర్లు, 3-6 ఏళ్ల చిన్నారులకు సైతం పాలు-2.50 లీటర్లు, కోడిగుడ్లు-25 వీటితో పాటు మధ్యాహ్నం భోజనం ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పెట్టాలి. జిల్లాలో క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో సదరు మెనూ అమలు కావడం లేదు. ప్రధానంగా విడతల వారిగా అందించే గుడ్లు, పాలు, కిట్లు సైతం సక్రమంగా ఇవ్వడం లేదని తెలిసింది. వీటికి తోడు ప్రతినెల 20 రోజులు సీడీపీవోలు, ప్రతి రోజు రెండు కేంద్రాలను సూపర్‌వైజర్లు తనిఖీ చేయాల్సి ఉంది. ఆదిశగా క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయడం లేదు.

లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తే..



లబ్ధిదారులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే ఉన్నతాధికారులు తెలియజేస్తాం. కాంట్రాక్టర్లకు కూడా సమస్యను వివరిస్తాం. పునరావృతం కాకుండా చూడాలని చెబుతున్నాం.
- సరస్వతి, అంగన్‌వాడీ కార్యకర్త, నంద్యాల

మధ్యాహ్నం 2గంటలకే తాళం వేసి..

నంద్యాల పట్టణంలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఇటీవలే ఆంధ్రజ్యోతి పరిశీలించింది. పరాన్‌పేట, బాలకొండహాల్, నడిగడ్డ బైపాస్‌రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాలు మధ్యాహ్నం 2 గంటలకే తాళం వేసి ఉంది. నంద్యాల పట్టణంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక మండల ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఏదిఏమైనా అధికారులు నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల నిర్వాహకంతో ఆయా లబ్ధిదారుల్లో ఆమోమయం నెలకొంది.



నంద్యాల పట్టణంలో మధ్యాహ్నానికే తాళం వేసిన అంగన్‌వాడీ కేంద్రం

ఖర్జూరం బూజుగా.. నల్లగా వస్తున్నాయి..



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఖర్జూరం నల్లగా ఉండటంతో బూజుగా వస్తున్నాయి. కవర్ తీయగానే దుర్వాసన వస్తోంది. అప్పుడప్పుడు గుడ్లు కూడా చిన్నసైజులో వస్తున్నాయి.
- అప్పనా, గర్భిణి, నంద్యాల



నల్లగా..బూజు పట్టిన ఖర్జూరం

చర్యలు తీసుకుంటాం

అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే పౌష్టికాహారం, పలు రకాల సరుకులపై ప్రత్యేక కమిటీ ద్వారా పరిశీలించి కేంద్రాలకు పంపుతున్నాం. ఎక్కడైనా సమస్యలుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా తనిఖీలు చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించాలి. గతంలో అక్కడక్కడ సమస్యలున్న మాట వాస్తవమే.
- లీలావతి, పీడీ, ఐసీడీఎస్, నంద్యాల

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్-1994సలహా కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిఘాతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లాలో డెకాయ్ ఆపరేషన్లు పటిష్టంగా అమలుపరిచి స్త్రీ నిష్పత్తిని గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లపై అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఐవో సుదర్శన్‌బాబు, డెమో ఇన్‌చార్జి కె.రవీంద్రనాయక్, వైద్యాధికారులు పద్మజ, అరుణజ్యోతి, శ్రావణ్‌కుమార్, ఎన్‌జీవోలు డా.రాజశేఖర్, పాల్‌రాజారావు, రామారావు, న్యాయవాది మోతీలాల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతులను ఆదుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



టమోటా రైతులతో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

ప్యాపిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్యాపిలిలోని టమోటా మార్కెట్‌ను సోమవారం ఆయన పరిశీలించాచారు. రామకృష్ణ రైతులతో మాట్లాడుతూ మార్కెట్‌లో గత 20 రోజులుగా కిలో టమోటలు రూ.4 మించి పలకడం లేదని రైతులు రామకృష్ణ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దగా చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో దోపిడీ జరుగుతున్నా అధికారులు ఎవ్వరూ కూడా అసలు పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ టమోటా ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని త్వరలో సీఎం చంద్రబాబుతో పాటు వ్యవసాయశాఖ మంత్రిని కలుస్తామని తెలిపారు. రైతులకు న్యాయం జరగని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నంద్యాల, కర్నూలు కార్యదర్శులు రంగనాయుడు, గిడ్డయ్య, రామాంజనేయులు, రాధాకృష్ణ, మహేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- ఉద్యాన పంటల సాగు పెంచే దిశగా అడుగులు
- జిల్లా స్థూల ఉత్పత్తిని పెంచేలా చర్యలు
- సదస్సులో కలెక్టర్ రాజకుమారి





కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

నంద్యాల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి రంగాలకు పెద్ద పీట వేయడంతో పాటు తలసరి ఆదాయం పెంచేలా చూడాల్సిన అవసరం ఎంతైనా సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు ఆదేశించారు. సోమవారం అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు కలెక్టర్ రాజకుమారికి జిల్లా అభివృద్ధి, సంక్షేమం, ప్రగతికి సంబంధించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెంచి వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారని కలెక్టర్ తెలిపారు. అలాగే అర్హులైన ప్రతి రైతులకు డ్రిప్, బీమా సదుపాయం కల్పించి పండించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలన్నారు. ప్రతి కలెక్టర్ అభివృద్ధి, సంక్షేమ తదితర ప్రధాన అంశాల పరంగా పోటీ పడే విధంగా విధులు ఉండాలని సూచించారు. కలెక్టర్ రాజకుమారి అభివృద్ధి, పురోగతి, తలసరి ఆదాయం తదితర అంశాలపై తయారు చేసిన ప్రణాళికను సీఎంకు వివరించారు.

విచారణ జరిపి న్యాయం చేస్తాం

- ఎస్పీ సునీల్ షెరాన్
- పోలీసు కార్యాలయానికి 105 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి అర్జీని విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్పీ సునీల్ షెరాన్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమానికి 105 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు ఇస్మాయిల్, మోహన్‌రెడ్డి, జయరాములు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



మాది వి.రామాపురం గ్రామం. గతంలో ప్రభుత్వం మాకు 1.45సెంట్ల భూమిని ఇచ్చారు. మా పొలం పక్కనే ఉన్న వ్యక్తి దానమయ్యకు గుత్తకు ఇచ్చాం. ప్రస్తుతం పొలం తనది అని, నేను ఎవరికి ఇవ్వను అంటున్నాడు. ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే పట్టించుకోవడం లేదు.
- సరోజమ్మ, వి.రామాపురం, ఆత్మకూరు మండలం

సబ్సిడీని అప్రూవల్ చేయిస్తానని..



మూడేళ్ల కిందట నేను ఎక్స్‌కవేటర్‌ని ఎస్సీ కార్పొరేషన్ కింద కొనుగోలు చేశాం. నంద్యాలకు చెందిన అరుణ అనే మహిళ నేను సబ్సిడీని అప్రూవల్ చేయిస్తానని అందుకు ఖర్చు అవుతుందని రూ.1.5లక్షలు తీసుకుంది. మూడేళ్లయినా ఇంత వరకు తిరిగి ఇవ్వలేదు. లోన్ అప్రూవల్ రాలేదు.
- దానమయ్య, రామతీర్థం, బనగానపల్లె మండలం

ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించాడు



మా మామ మా ఇంటి స్థలాన్ని తన కూతురు పేరు ఇటీవల రిజిస్ట్రేషన్ చేయించాడు. గతంలోనే మాకు ఇచ్చినట్లు పత్రాలు రాసిచ్చారు. ఇప్పుడు మా తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత మాకు తెలియకుండా తన కూతురు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకొని మోసం చేశారు. గోస్పాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.
- చాంద్‌బాషా, యళ్లూరు, గోస్పాడు మండలం

డీఎస్సీ సెలెక్షన్ ఫైనల్ లిస్టు విడుదల

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ మెగా డీఎస్సీ తుది జాబితాను సోమవారం రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. ఎంపికైన వారి జాబితాను వెబ్‌సైట్‌తో పాటు కలెక్టరేట్‌లోనూ, డీఈవో కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉంచారు. నోటిఫికేషన్ మొదలు నియామక పత్రాల వరకు ప్రతి దశలోనూ అత్యంత పారదర్శకత పాటిస్తూ మెగా డీఎస్సీని ప్రభుత్వం నిర్వహించింది. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దసరా సెలవుల సమయంలో జిల్లాలవారీగా ఈనెల 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు ఇండక్షన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది

ఈ భూములు కొనవద్దు

- రిజిస్ట్రేషన్లను అడ్డుకున్న ఏబీఎం సంస్థ ప్రతినిధులు
- భూముల వ్యవహారంపై రచ్చ



ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్‌ను ప్రశ్నిస్తున్న ఏబీఎం సంస్థ ప్రతినిధులు

ఆత్మకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలోని అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీ (ఏబీఎం) భూములను ఎవరూ కొనవద్దని ఆ సంస్థ ప్రతినిధులు హెచ్చరించారు. ఈ భూములను రిజిస్ట్రేషన్లను సోమవారం ఆ సంస్థ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ సాల్మన్, కస్టోడియన్ రాబిన్‌సన్ రాజు అడ్డుకున్నారు. ఈ భూముల వ్యవహారంపై రచ్చ సాగుతోంది. మండలంలోని అమలాపురం గ్రామ సమీపంలో ఏబీఎం భూములను మధ్య దళారులు కొనుగోలుచేసి వాటిని ప్లాట్ల రూపంలో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నట్లు తెలుసుకున్న ఆసంస్థ ప్రతినిధులు ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని రిజిస్ట్రేషన్లు జరగకుండా అడ్డుకున్నారు. అప్పటికే మూడు ప్లాట్లకు సంబంధించి 10సెంట్ల రిజిస్ట్రేషన్ చేయడంపై ఆసంస్థ వారు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఏబీఎం భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని కోరినా ఎందుకు రిజిస్ట్రర్ చేశారంటూ నిలదీశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. 1925లో ఏబీఎం సంస్థ వారు చర్చిల అభివృద్ధికి వేలాది ఎకరాలను కొనుగోలు చేశామన్నారు. ప్రత్యేకించి ఆత్మకూరు, కృష్ణాపురం, సిద్దేపల్లి, ముష్టేపల్లి, సిద్ధాపురం గ్రామాలతో పాటు మరిన్ని ప్రాంతాల్లో సుమారు రెండు ఎకరాల భూములను ఏబీఎం సంస్థ కొనుగోలుచేసి చర్చిల అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. ఆ భూములను కొంతమంది అక్రమార్కులు స్వాధీనం చేసుకుని వాటికి అక్రమంగా పాస్ పుస్తకాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు వివరించారు. ఈ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లను ఏర్పాటుచేసి కనీసం ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే విక్రయించే ప్రయత్నాలు చేశారు. ఈ విషయాలను గతంలో సబ్‌రిజిస్ట్రార్ వారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయడమేమిటని ప్రశ్నించారు. తమ భూముల కోసం తాము న్యాయపోరాటం చేస్తున్నామని ప్రజలెవరూ ఆ భూములను కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

ప్రొహిబిటెడ్ లేనందునే రిజిస్ట్రేషన్లు చేశాం



ఏబీఎం భూములు ప్రొహిబిటెడ్‌లో లేనందునే రిజిస్ట్రేషన్లు చేశాం. పైగా వ్యవసాయ భూమి ల్యాండ్ కన్వనర్ చేయకుండానే ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దని నోటీసులు వచ్చిన విషయం వాస్తవమే. అయినప్పటికీ భూములను ప్రొహిబిటెడ్‌లో ఉంచితేనే తాము రిజిస్ట్రేషన్లు చేయం.
- అబ్దుల్ కరీం, సబ్ రిజిస్ట్రార్, ఆత్మకూరు

రిజిస్ట్రేషన్ చేయవద్దని తెలియపరిచాం




ప్రజల ఫిర్యాదుల మేరకు ఏబీఎం భూములను రిజిస్ట్రేషన్లు చేయవద్దని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు ముందస్తుగానే సమాచారమిచ్చాం. ఈ విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్లి ఆ భూములను ప్రొహిబిటెడ్‌లో ఉంచేందుకు తాము నివేదికలు తయారు చేసేలోగానే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు రిజిస్ట్రేషన్లు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం ఆత్మకూరు రెవెన్యూ గ్రామం మినహా మండలంలోని మిగతా గ్రామాల్లోని ఏబీఎం భూములను ప్రొహిబిటెడ్‌లో ఉంచాం.
- రత్నరాధిక, తహసీల్దార్, ఆత్మకూరు



ఓజోన్ ఫర్ లైఫ్

ఓజోన్ పొర వినాశనం వల్ల కలిగే దుష్పరిణామాలు

గాలి, నీరు, వాయు కాలుష్యాల ద్వారే వాతావరణ మార్పులు సంభవించి ప్రకృతి వనరులకు ఆటంకం కలుగుతోంది. ప్లాస్టిక్ వంటి వస్తువుల వాడకం వల్ల చెట్టు, చీమలతో పాటు అన్ని జీవులతో పెనుభూతంగా మారుతోంది. భూమిలో నీరునిల్వలు కనుమరుగయ్యేందుకు కూడా ప్లాస్టిక్ ప్రభావం ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఏటా 20 నుంచి 30లక్షల మంది చర్మ కేన్సర్ బారిన పడుతున్నారు. వారిలో 20శాతం పైగా రోగులు సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు నేరుగా సోకిన ఫలితంగా కేన్సర్ బారిన పడినట్లు అంచనా వేశారు.



ఏటా ఒక్కో నినాదంతో అవగాహన

ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా ఓ నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఓజోన్ ఫర్ లైఫ్ అనే నినాదాన్ని నిర్ణయించారు. ప్రస్తుతం జరుగుతున్న పర్యావరణ వినాశన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మన భూమికి ఓజోన్ పొర ప్రాముఖ్యతను, భవిష్యత్ తరాలకు దాన్ని రక్షించాల్సిన ఆవశ్యకతను తెలియజేసేలా ఈ నినాదాన్ని ఎంపిక చేశారు.

- ఇదే మనందరి నినాదం కావాలి
- నిర్లక్ష్యం వహిస్తే భావితరాలకు ముప్పే
- నేడు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినం

ఆత్మకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాల విశ్వంలో జీవం ఉనికి భూమిపైన మాత్రమే ఉండడం కఠిన వాస్తవం. అలాంటి జీవి మనగడ సాగేందుకు అవసరమైన పర్యావరణాన్ని నిలుపుకోవడం జీవుల ప్రధాన బాధ్యత. అయితే మానవుడు పర్యావరణ విధ్వంసానికి పూనుకుంటున్నాడు. మానవ జీవన ప్రతిబింబమే పర్యావరణమన్న విషయాన్ని ప్రజలకు వివరించేందుకు ఏటా సెప్టెంబరు 16వ తేదీన ప్రపంచదేశాలన్నీ.. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినంగా ఆనవాతీగా నిర్వహిస్తూ వస్తున్నాయి. ఓజోన్ పొరను దెబ్బ తీస్తున్న పదార్థాల నియంత్రణకు గాను రూపొందించిన మాంట్రియల్ ప్రోటోకాల్‌పై ప్రపంచ దేశాలు ఈ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఆయా దేశాల ప్రతినిధులు 1987 సెప్టెంబరు 16వ తేదిన సంతకాలు చేయగా 1994 నుంచి ఈ దినోత్సవాన్ని జరుపుతూ వస్తున్నారు. కాగా భూమి మీద కాలుష్యం కారణంగా దెబ్బతింటున్న ఓజోన్ పొరను పరిరక్షించేందుకు నేషన్స్ జనరల్ అసెంబ్లీ ఈ ఒప్పందాన్ని రూపొందించి ప్రపంచ దేశాలన్నింటిని దీనిపై అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. వాస్తవానికి భూమిపైభాగంలో స్ట్రాటోస్పియర్ ఆవరణలో ఉన్న ఓజోన్ పొర భూమి మీదికి వచ్చే అన్ని విశ్వకిరణాలను అడ్డుకుని భూమిని పరిరక్షిస్తోంది. రసాయన కాలుష్యాల ప్రభావ ఫలితంగా ఓజోన్ పొరకు చిల్లుపడినట్లయితే సూర్యుడి నుంచి అతినీల లోహిత కిరణాలను నేరుగా భూమ్మిదకు ప్రసరించి మానవజాతికి, సమస్త జీవజాతులకు ప్రమాదకరంగా మారనుంది.

ఓజోన్ పొర పరిరక్షణలో టాప్‌లో నిలిచిన భారత్



ఓజోన్ పొరను పరిక్షించడంలో మనదేశం ప్రపంచ దేశాలకెల్లా ముందంజలో ఉంది. ఓజోన్ పొరకు హాని కలిగించే పలు పదార్థాల తయారీని నిషేధించడంలో ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇందులో భాగంగా మాంటియల్ ప్రోటోకాల్ సంబంధిత చర్యల అమలుకు గానూ 1993 నుంచి భారత్ పలు కార్యక్రమాలను చేపట్టింది. సీఎఫ్‌సీ, హాలోన్, సీటీసీ వంటి పదార్థాల ఉత్పత్తి వినియోగాన్ని నిలిపివేసేందుకు గానూ 296 కన్వర్షన్ ప్రాజెక్టులను భారత్ ఆమోదించింది. ఈ క్రమంలో 2008 ఆగస్టు నాటికి ఓజోన్ పొరకు హానీ కలిగించే క్లోరోఫ్లోరో కార్బన్‌ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిషేధించింది. మాంట్రియల్ ప్రోటోకాల్‌ను అత్యుత్తమంగా అమలుచేసిన దేశాలకు ఇచ్చే అవార్డును భారత్ కైవసం చేసుకుంది. మాంట్రియల్ ప్రోటోకాల్ 20వ వార్షికోత్సవం సందర్భంగా కెనడాలోని మాంట్రియల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 2007 సెప్టెంబరు 16వ తేదీన ఈ అవార్డును దక్కించుకుంది.

ఓజోన్ పొర పరిరక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు

అవసరమైనంత వరకు వాయు, జల, శబ్ద కాలుష్యం జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంధనం, విద్యుత్ పొదుపు చేపట్టాలి. తద్వారా బొగ్గు, ఇంధన వినియోగం నియంత్రించడం వల్ల భవిష్యత్ తరాలకు వనరులను అందించడమే కాకుండా పర్యావరణ విఘాత సమస్యను పరిష్కరించవచ్చును. కాలుష్యం ఉత్పన్నమయ్యే వాహనాల వినియోగాన్ని తగ్గించాలి. అవసరమైనంత వరకు వారం ఓ రోజు ప్రజారవాణా చేపట్టాలి. అలాగే ఇంధనరహిత వాహనాలైన సైకిళ్లను ఉపయోగించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తే ఓజోన్ పొరతో పాటు భూగర్భజలాలను కూడా సంరక్షించవచ్చు. పరిశ్రమలు, మరే ఇతర కాలుష్య కారకాల నియంత్రణకు తోడ్పాటునందించాలి. చెట్లను పెంచతూ.. పచ్చదనం.. పరిరక్షణకు ప్రజల్లో అవగాహన కల్పించాలి. అలాగే అడవుల ప్రాధాన్యతను కూడా వివరించాలి. విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన అంశాలను వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం సైతం కాలుష్య కారకాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు స్వచ్ఛంద సంస్థ సహకారంతో నివారించాల్సి ఉంది. వివిధ కాలుష్యాల బారిన పడి ధరణిమాత విలపిస్తోంది. ఓజోన్ పొరకు పడ్డ చిల్లులను పూడ్చడం ద్వారే ఈ సమస్యలను అరికట్టేందుకు అవకాశం ఉంది. ఇందుకోసం ప్రపంచదేశాలన్నీ చిత్తశుద్ధితో ఓజోన్ పొర పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలి.

మొక్కలు నాటాలి



మొక్కల పెంపకంతోనే ఓజోన్ పొర పరిరక్షణ సాధ్యపడుతుంది. 50ఏళ్ల చెట్టు వల్ల సుమారు రూ.50 లక్షల ఉపయోగం ఉంది. ఈ విషయాన్ని గుర్తించని మనిషి తన స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నారు. ఐరాస ఇచ్చిన సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30కోట్ల హెక్టార్లలో అడవులు ఉండగా ప్రస్తుతం 2 నుంచి 3 కోట్ల హెక్టార్ల వరకు అడవులు క్షీణించాయి. ప్రజలు కూడా ఓజోన్ పొర వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

● మగ్బుల్‌బాషా, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, బనగానపల్లె రేంజ్

రాంబొట్ల దేవాలయ అభివృద్ధి పనులు చేపట్టాలి: వీహెచ్‌పీ



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో సుమారు 110 సంవత్సరాల చరిత్ర కలిగిన అతి పురాతన దేవాలయం రాంబొట్ల దేవాలయం శిథిలావస్థకు చేరుకుంటోందని, దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని ఆ శాఖ అధికారులు వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి డిమాండ్ చేశారు. సోమవారం వీహెచ్‌పీ, ఇతర అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పాతనగరంలోని రాంబొట్ల దేవాలయాన్ని వీహెచ్‌పీ నాయకులు సందిర్శంచారు. వీహెచ్‌పీ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రాంబొట్ల దేవాలయం పరిస్థితిపై తాము కొన్ని డిమాండ్లను దేవదాయ శాఖ అదికారులకు తెలియజేశామని తెలిపారు. టీటీడీ వారు నిర్మించిన కల్యాణ మంటపం నిరుపయోగంగా మారిందని, దాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ దీపిక, కార్పొరేటర్లు వాసు, శేషయాదవ్, నాయకులు, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువ ఇంజనీర్లకు స్ఫూర్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య

● జలవనరుల శాఖ సీఈ కబీర్‌బాషా



విద్యార్థినికి నగదు బహుమతి, పురస్కారం అందజేస్తున్న జలవనరుల శాఖ సీఈ కబీర్‌బాషా తదితరులు

కర్నూలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లకు ఇంజనీరింగ్ పితామహుడు, దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిదాయకమని ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా అన్నారు. సోమవారం రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం నాయకులు రిటైర్డ్ ఈఈ విశ్వనాథ్ ఆధ్వర్యంలో 'జాతీయ ఇంజనీర్ల దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి, మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా సీఈ కబీర్‌బాషా మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ప్రాజెక్టుల నిర్మాణంలో సత్తా చాటిని గొప్ప మేధావి దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఈఎన్‌సీ జలంధర్, రిటైర్డ్ సీఈ మురళీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలం గేట్లు మూసివేత



మూసివేసిన గేట్లు

శ్రీశైలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. సోమవారం డ్యాం గేట్లన్నీ మూసివేశారు. జలాశయంలో గరిష్ఠ స్థాయి నిల్వలతో నిలకడగా ఉంచారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి 76,328 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి. శ్రీశైలం డ్యాం నీటిమట్టం సాయంతం 6గంటల సమయానికి 883 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 208 టీఎంసీలుగా నమోదైంది. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం 66,234 క్యూసెక్కులు విడుదల చేశారు.

కర్నూలు యార్డుకు 18,099 క్వింటాళ్ల ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు సోమవారం రైతులు భారీగా ఉల్లి గడ్డలు అమ్మకానికి తెచ్చారు. గత రెండు రోజులుగా ఉల్లి అమ్మకాలు జరగకపోవడం, మరోవైపు దసరా పండుగ సమీపిస్తుండటంతో రైతులు పెద్ద ఎత్తున ఉల్లిని అమ్మకానికి తెస్తున్నారు. రైతులకు మార్క్‌ఫెడ్ అండగా నిలబడి ప్రభుత్వం నిర్ణయించిన క్వింటానికి రూ.1,200ల ధర చెల్లించి కొనుగోలు చేయడంతో వ్యాపారుల బారిన పడి నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి రైతులకు తప్పి పోయింది. మార్క్‌ఫెడ్ డీఎం రాజు, సిబ్బంది మౌలాలి తదితరులు రైతుల నుంచి ఏకంగా 10,022 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేశారు. మిగిలిన 8,077 క్వింటాళ్ల ఉల్లిని వ్యాపారులు కొనుగోలు చేశారు. ఒక ప్రభుత్వ సంస్థ ఇంత పెద్ద మొత్తంలో ఒకేరోజు రైతుల నుంచి గతంలో ఎప్పుడూ కొనుగోలు చేయలేదని మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు.

నేడు ఉల్లి వేలం

కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని మంగళవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య ఆధ్వర్యంలో అమ్మకాలు నిర్వహిస్తున్నామని మార్క్‌ఫెడ్ మేనేజర్ తెలిపారు. ఈ వేలంలో జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, హోటల్ యజమానులు పాల్గొనాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఉల్లికి క్వింటానికి ప్రకటించిన రూ.1,200లు ఒక కర్నూలు యార్డులోనే కాకుండా తాడేపల్లి గూడెం మార్కెట్ యార్డులో కూడా విక్రయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకుని ప్రయోజనం పొందాలని మార్క్‌ఫెడ్ డీఎం రాజు కోరారు.

ఆరోగ్య శిబిరాలు నిర్వహించండి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శిబిరాలు నిర్వహించి మహిళలకు వైద్యపరీక్షలు, ఆరోగ్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ హరిచరణ్ ఆధ్వర్యంలో ఈ నెల 17నుంచి అక్టోబరు 2వరకు నిర్వహించనున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈఎన్‌టీ, రక్తపోటు, రక్తంలో చక్కెరస్థాయిలు, దంత పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్‌లు, రోగ నిరోధక సేవలు, మాతాశిశు సంరక్షణ సేవలు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఓ.లలిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'మూడు లక్షల ఎకరాలకు అందని నీరు'



మాట్లాడుతున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు ఈఏడాది 100 రోజులు వరద వచ్చినా జలవనరుల శాఖ నిర్లక్ష్యంతో మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందలేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆ సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ నీటి హక్కులపై ఏ విధంగా దాడి జరుగుతుందో తెలుసుకునేందుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కాంప్లెక్స్‌ను సందర్శిస్తామన్నారు. శ్రీశైలానికి వచ్చే వరద 30 రోజులకు మించి ఉండని నేపథ్యంలో రిజర్వాయర్లను 30 రోజుల్లో నింపి 7,50,000 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉందన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు

గోనెగండ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో చింతలాముని నల్లారెడ్డి స్వామి వారి దశమి మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీలు సోమవారం నిర్వహించారు. విజేతలకు సోమవారం రాత్రి నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఆరుపళ్ల సైజ్ పోటీలలో ప్రథమ బహుమతి కర్నూలు జిల్లా బీఎల్‌కే వెంకటగిరికి చెందిన ఎద్దులు రూ. 40వేలు, రెండో బహుమతి గుంటూరు జిల్లా శ్రీనివాసులు ఎద్దులు రూ. 30వేలు, మూడో బహుమతి కర్నూలు జిల్లా బీఎల్‌కే వెంకటగిరి ఎద్దులు రూ. 20వేలు, నాలుగో బహుమతి కొత్తురు గ్రామ బీఎస్ఎస్ రెడ్డి ఎద్దులు రూ. 10వేలు గెలుచుకున్నాయి. నాలుగు పళ్ల సైజ్ పోటీలలో మొదటి బహుమతి చిన్ననేలటూరు గ్రామానికి చెందిన కుమారస్వామి ఎద్దులు, రూ. 30వేలు రెండో బహుమతి పగిడ్యాల గ్రామానికి చెందిన రవికుమార్ ఎద్దులు రూ. 20వేలు, మూడో బహుమతి రోళ్ల పాడు ప్రభాకర్‌రెడ్డి ఎద్దులు రూ. 15వేలు గెలుచుకున్నాయి. అలాగే న్యూ కేటగిరి బండలాగుడు పోటీలలో మొదటి బహుమతి రూ.50 వేలు ప్రకాశం జిల్లా శేషాద్రి చౌదరి ఎద్దులు గెలుచుకున్నాయి. రెండో బహుమతిని గుంటూరు జిల్లా చౌదరి కొండబాలవారి పాలేం ఎద్దులు రూ.40 వేలను, మూడో బహుమతి రూ. 30 వేలు నాగర్‌కర్నూలు రాయవరం గ్రామానికి చెందిన అక్షరరెడ్డి ఎద్దులు, నాలుగో బహుమతి రూ. 20వేలను అనంతపురం జిల్లా ఆముదాల రమేష్ ఎద్దులు గెలుచుకున్నారు. అలాగే ఐదో బహుమతి రూ. 10వేలను గద్వాల జిల్లా మేడి కొండ సద్దామ్ హుసేన్, ఆరో బహుమతిని ఎమ్మిగనూరు దుబ్బన్న, రంగస్వామి ఎద్దులు రూ. 5వేలను గెలుచుకున్నాయి. వారికి నగదు బహుమతి అందజేశారు. నిర్వాహకులు ఉసేన్, రెహంతుల్లా, శివన్న, నూర, గోపాల్, వెంకటేశ్, మాబు, భాస్కర్ పాల్గొన్నారు.

నాట్య కిరీటి సురేష్



నాట్యగురువులతో ప్రవీణ పురస్కారం అందుకుంటున్న సురేష్



- కూచిపూడిలో రాణింపు
- నృత్య ప్రదర్శనల్లో చిన్నారులకు శిక్షణ
- నాట్యాచార్యుడు సాంబశివ పర్యవేక్షణలో ఎదుగుదల
- సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా పనిచేశారు
- కూచిపూడిలో ఎంఏ పట్టా
- పలువురితో ప్రశంసలు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ శాస్త్రీయ నృత్యాల్లో కూచిపూడి ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడి అనే గ్రామం నుంచి నాట్యం ఉద్భవించింది. కూచిపూడి నాట్యం భరత నాట్యానికి దగ్గరి పోలికలు ఉంటాయి. కూచిపూడికి ప్రత్యేక నాట్యరీతులున్నాయి. కూచిపూడి నృత్యకారులు స్వచ్ఛమైన, వ్యక్తీకరణ నృత్యం, నాట్యం, అభినయం. అభినయం అనగా కూచిపూడి నృత్యంలో ముఖ కవళికలు, చేతిసంజ్ఞల కళ. కూచిపూడి నృత్య కారులు నృత్యం యొక్క భావోద్వేగాలను, అర్థాన్ని తెలియజేయడానికి అభినయాన్ని ఉపయోగిస్తారు. కూచిపూడి నృత్యప్రదర్శనలో నంద్యాలకు చెందిన పల్లంశెట్టి సురేష్ కృషిచేస్తున్నారు. సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌ను(2012) స్థాపించి కూచిపూడి నృత్య ప్రదర్శనలో వందలాది మంది చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. సురేష్‌పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

సినిమాలపై ఆసక్తితో..

నంద్యాల ఎస్‌బీఐ కాలనీకి చెందిన వెంకటసుబ్బయ్య, రాజేశ్వరీ దంపతుల కుమారుడు పల్లంశెట్టి సురేష్. పదో తరగతి వరకు నంద్యాల పురపాలక పాఠశాలలో చదివారు. సినిమాలపై ఆసక్తితో హైదరాబాద్‌కు వెళ్లారు. సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా పనిచేశారు. నాట్యాచార్యుడు మునుకుంట్ల సాంబశివ ఆదరణతో నృత్యంలో అంచెలంచెలుగా ఎదిగారు. కొద్దిరోజులు కూచిపూడి కళాకారిణి పద్మకళ్యాణి వద్ద నృత్యంలోని మెలకువలు నేర్చుకున్నారు. కృష్ణాజిల్లా అగ్రహారంలో రాధేశ్యామ్ గురువవద్ద కూచిపూడి కోర్సుచేశారు. హైదరాబాద్‌లోని భక్త రామదాస్ కళాశాలలో కూచిపూడి డిప్లొమా పూర్తిచేశారు. కూచిపూడి ఎంఏ చదివి పట్టా పొందారు. పలువురికి నృత్య ప్రదర్శనలో శిక్షణ ఇస్తూ ప్రశంసలు అందుకున్నారు.



2025లో రామఅన్నమయ్య నాట్య వైభవం పురస్కారం అందుకుంటున్న సురేష్

ప్రదర్శనలు

- 2011లో నంద్యాలలో 11గంటల పాటు నిరవధికంగా నృత్య ప్రదర్శన చేశారు.
- 2012లో పేద కళాకారుల సహాయనిధి కోసం ప్రదర్శనలిచ్చారు. కూచిపూడికి ఆదరణ పెంచేందుకు వందలాది మంది కళాకారులతో కలిసి నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రశంసలు పొందారు.

పురస్కారాలు

- 2015లో కేంద్ర ప్రభుత్వం ఐసీసీఆర్ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద నృత్యోత్సవాల్లో శిల్పారామంలో చేపట్టిన నృత్యోత్సవాల్లో నాట్య గురువు పురస్కారం
- 2016లో వెంపటి చినసత్యం జయంతి సందర్భంగా నిర్వహించిన నృత్యప్రదర్శనలో నిహూంబిక నాట్య జ్ఞానపీఠ్ పురస్కారం అందుకున్నారు. అదే సంవత్సరం టీటీడీ వారి రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ సాంస్కృతిక పురస్కారం దక్కించుకున్నారు.
- 2017లో తెలంగాణలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో నాట్య నిపుణ పురస్కారాన్ని పొందారు.
- 2018 జనవరిలో మహాత్మా జ్యోతిరావ్‌పులే సేవారత్న జాతీయ అవార్డు. అదేసంవత్సరం మార్చిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.
- 2022 ఆగస్టులో తిరుపతిలో అభినయ ఆర్ట్స్ వారిచే హనుమాన్ అవార్డు. శ్రీశైలంలో తిరుపతి నాట్యశిఖ అవార్డు. అదే ఏడాది సెప్టెంబరులో చెన్నైకు చెందిన హ్యూమినిటీ గ్లోబల్ పేస్ ఫెడరేషన్ వారి కూచిపూడి కళారత్న అవార్డుతో సత్కరించారు. విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయం వారిచే నృత్య విజ్ఞాన్ పురస్కారం అందుకున్నారు.
- 2022లో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్య శాఖ వారు ప్రకటించిన జూనియర్ ఫెలోషిప్ అవార్డుకు ఏపీ నుంచి సురేష్ ఒక్కరే ఎంపికయ్యారు.
- 2023లో రామ అన్నమయ్య నాట్యవైభవం పురస్కారం. కాణిపాకం శేషాద్రి జ్ఞానపీఠ అవార్డు, తిరుమల ఉత్తమ సేవా పురస్కారం, నాట్య నిపుణ షోడశ నాట్యగురు అవార్డు, హైదారాబాదులో నర్తన మానస అవార్డు. శ్రీశైలంలో స్మారక సమ్మాన్, కోల్‌కత్తాలో నారయణి నంది అవార్డు.
- 2024లో తిరుపతి వినాయక సంగీత నృత్యవైభవం అవార్డు, విజయవాడ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో పురస్కారం. కర్నూలులో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు. ఢిల్లీ వినాయక నాట్య నందీశ్వర పురస్కారం.
- 2025లో రాజమండ్రి రాయలసీమ నృత్య రత్న పురస్కారం. ప్రొద్దుటూరులో స్వర్ణ మం జరి అవార్డు. చెన్నైలో తాండవ నృత్య ప్రవీణ పురస్కారం, శ్రీశైలంలో నాట్య గందర్వ అవార్డు.
- ఈ ఏడాది జనవరి 24న కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్‌భారత్ రింగ్ మహోత్సవంలో పాల్గొని వరల్డ్ బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు.
- మార్చిలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఏపీ భవన్‌లో ఏపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో కూచిపూడి ఉత్సవాల్లో పాల్గొని పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్, కమిషనర్ లవ్‌అగర్వాల్ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లి సేవలో తరిస్తా

ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లి సేవలో తరిస్తా. లక్ష్యం లేని జీవితం వృథా. ప్రతి ఒక్కరూ తమలోని నైపుణ్యాలను గుర్తించి ఉన్నత లక్ష్య సాధనకు కృషిచేయాలి. కష్టం లేకుండా ఏదీ దక్కదు. పదిమందికి నృత్య ప్రదర్శనలో శిక్షణ ఇస్తున్నా. ఎక్కడ అవకాశం వచ్చినా వదులుకోకుండా నృత్య ప్రదర్శనలు ఇస్తున్నా

● పల్లంశెట్టి సురేష్, కూచిపూడి నాట్య కళాకారుడు

విచారణ జరిపి న్యాయం చేస్తాం

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 81 అర్జీలు : ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 81 అర్జీలు వచ్చాయి. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే స్టేషన్ పరిధిలో సుంకేసుల రోడ్డు.. నేతాజీ కాంప్లెక్స్ రైల్వే బ్రిడ్జి సమీపంలో తుంగభద్ర నదిలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వేపోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి చేతికి వెండి కడియం ఉంది. దానిపైన చిన్నవేలు మల్లమ్మ, నాగిమునెమ్మ, పెద్దవేలు మల్లమ్మ ఈశ్వరుడు, మల్లికార్జున, బండన్న అనే అక్షరాలు తెలుగులో ఉన్నాయి. శరీరంపై నలుపు రంగు చొక్కా ధరించాడు. జేబులో తాళాల గుత్తి ఉంది. ఆటోకు సంబంధించిన మూడు తాళాలు, ఇంటికి సంబంధించిన రెండు తాళాలు అందులో ఉన్నాయి. మృతుని వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9908889696కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

నంద్యాల టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం పట్టణ శివారులోని చాబోలు వద్ద చోటుచేసుకున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు. వివరాలు.. శిరివెళ్ల మండలం కామినేనిపల్లెకు చెందిన కే.నరసింహ(37)కు తెలంగాణ నిజామాబాద్ జిల్లాకు చెందిన యువతితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య కుటుంబ కలహాలు రావడంతో వీడి ఉంటున్నారు. దీంతో మనస్థాపం చెందిన అతడు చాబోలు మెట్ట వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కూతురు ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

బెంచ్‌పై నుంచి పడి విద్యార్థినికి గాయాలు

ఆస్పరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బెంచ్‌పై నుంచి పడిన విద్యార్థినికి రక్తగాయాలైన ఘటన మండలంలోని పుటకలమర్రి మోడల్ స్కూల్‌లో సోమవారం జరిగింది. ప్రిన్సిపాల్ ఎస్.సమీల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోడల్ స్కూల్లో ఇంటర్ సెకండియర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థిని శ్రీకన్య ఉదయం 11 గంటల సమయంలో పరీక్షలు రాస్తుండగా ప్రమాదవశాత్తు బెంచ్‌పై పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స అనంతరం విద్యార్థిని క్షేమంగా ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

బాల్య వివాహాన్నిఅడ్డుకున్న పోలీసులు

ఆదోని, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారం సోమవారం పోలీసులకు అందింది. వెంటనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగిణి వసంతతో పాటు రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అక్కడికి వెళ్లారు. పెళ్లికూతురు మైనర్ కావడంతో బాలికల తల్లిదండ్రులు, అబ్బాయి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారికి బాల్యవివాహంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 ఏళ్లు నిండకుండా అమ్మాయికి వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. తెలిసి తెలియని వయస్సులో వారికి వివాహం చేయడం వల్ల అనర్థాలు తలెత్తుతాయని అధికారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు దాటిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. పెళ్లి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్యాబ్‌ల దొంగలు అరెస్టు

- 77 ట్యాబ్‌లు రికవరీ : ఏఎస్పీ మందా జావళి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల డిప్యూటీ డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న గదిలో ఇటీవలే ట్యాబ్‌లు చోరీకి గురయ్యాయి. నిందితులను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ మందా జావళి తెలిపారు. వివరాలు.. పది రోజుల కిందట విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన 90 ట్యాబ్‌లను డిప్యూటీ డీఈవో కార్యాలయంలోని ఓ గదిలో భద్రపరిచారు. చాంద్‌బాడకు చెందిన షేక్ హుస్సేన్, ఇంకో మైనర్ బాలుడు కలిసి దొంగతనం చేశాడు. ట్యాబ్‌లతో పాటు 150 ఓటీజీ కేబుల్స్, 60 ఆడాప్టార్లు, రెండు స్పైక్ గార్డ్స్ ఎత్తుకెళ్లారు. సోమవారం వారిని బీమవరం రోడ్డులోని ఈద్గా వద్ద పట్టుకున్నారు. వారి నుంచి 77 ట్యాబ్‌లతో మిలిగిన వాటిని రికవరీ చేశారు. ఈ సమావేశంలో వన్ టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది రమణ, అమీర్ బాషా, గురుశేఖర్ పాల్గొన్నారు. ఎస్పీ వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

చెస్ విజేతలకు బహుమతులు



విజేతలతో చెస్ నిర్వాహకులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల చెస్ సంఘం నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి చెస్ విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా.రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో మునినాగలక్ష్మి స్మారక రాష్ట్ర స్థాయి ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ స్పాన్సర్ రాజేష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సోమేశుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కరరెడ్డి, కోశాధికారి జనార్దన్, డా.నీలాప్రసాద్, డా.భరత్, సుజాత, రాజారమేష్‌చక్రవర్తి, ఇమాం, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతలు : ర్యాపిడ్ విభాగంలో శివపవన్‌తేజశర్మ ప్రథమ స్థానం (ఎన్‌టీఆర్ జిల్లా), లక్ష్మిత్ ద్వితీయ స్థానం (కర్నూలు జిల్లా), బ్లిట్జ్ విభాగంలో సాత్విక్ మొదటి స్థానం (కోనసీమజిల్లా), రామచరణ్‌తేజ ద్వితీయ స్థానం (తూర్పుగోదావరి జిల్లా), ఎస్‌ఆర్‌జీ చెస్ అకాడమీ విభాగంలో నీలేష్, షాలిని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

మోతాదు మించితే ముప్పే



- యూరియాను అధికంగా వాడితే భూసారం తగ్గే ప్రమాదం
- అవగాహనలేమితో నష్టపోతున్న అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పెరగనున్న వరి సాగు విస్తీర్ణం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలు సత్వరమే ఎదగాలంటే యూరియా వాడకం తప్పనిసరి అన్న పరిస్థితులు నేడు వ్యవసాయ రంగంలో నెలకొన్నాయి. ప్రధానంగా యూరియా వాడితే పంట దిగుబడులు బాగా వస్తాయన్న కారణంతో రైతులు యూరియాను అధికంగా వాడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత వ్యవసాయ విధానంలో గతంలో కన్నా రెట్టింపు స్థాయిలో రైతులు యూరియాను వినియోగిస్తున్నారన్న విషయం అధికారిక లెక్కలే తేల్చి చెబుతున్నాయి. అయితే యూరియా వినియోగం అతిగా జరిగితే అన్నీ అనర్థాలేనని పర్యావరణ శాస్త్రవేతలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా భూసారం దెబ్బతిని, నేలలు సహజత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు, నదులు, ప్రధాన కాలువలు, చెరువులు, బోరు బావుల కింద వరి సాగు ముమ్మరంగా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వరి సాధారణ సాగు విస్తీర్ణం 78,174 హెక్టార్లు కాగా, ఇప్పటికే 60వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. సహజంగా వరి సాగు చేసిన రైతులు పంట సాగు దగ్గర నుండి నూర్పిడి వరకు మూడు విడతలుగా 25 కేజీల చొప్పున 75 కేజీలు వాడాల్సి ఉంది. యూరియాకు తోడు మరో 75కేజీల కాంప్లెక్స్ ఎరువులు వినియోగించవచ్చు. అయితే రైతులు అవగాహన లేమి కారణంగా మొత్తం 150 కేజీలు(3బస్తాలు) యూరియా, మరో 3బస్తాలు కాంప్లెక్సు ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు ఎరువుల భారం అమాంతం పెరిగిపోతోంది. ప్రస్తుతం ఎరువుల ధరల ప్రకారం చూస్తే రైతులకు ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల సుమారు రూ.6వేలు అదనపు భారం పడుతోంది. సహజంగా ఎకరా వరి పంటకు 72కిలోల నత్రజని మాత్రమే అవసరం అవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. కాంప్లెక్సు ఎరువుల్లో సైతం నత్రజని మిళితమైవుంటుందని సూచిస్తున్నారు. రైతులుకు సరైన అవగాహన లేక యూరియాను ఎక్కువగా వాడేస్తున్నారని పేర్కొంటున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే, భూమి దెబ్బతినకుండా ఉండటంతో పాటు, రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని అంటున్నారు.



ఎక్కువగా వాడితే అనర్థాలే

యూరియాను అతిగా వినియోగించడం వల్ల పకృతి పరంగా అన్నీ అనర్థాలే జరిగే అవకాశం ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ, అధికారులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. క్రమంగా పంట పొలాలు భూసారం కోల్పోయి, కొంత కాలానికి నేలలు తమ సహజత్వాన్ని కోల్పోయి నిస్సారంగా మారే ప్రమాదం ఉందని అంటున్నారు. ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల భవిష్యత్తులో ఎన్ని ఎరువులు వేసినా పంటలు పండకపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సహజంగా భూసారం పెరిగే చర్యలు చేట్టి, ఎరువుల వాడకం తగ్గిస్తే ఎంతో మేలు చేకూరే అవకాశం ఉంటుంది. పిల్లి పెసర, జనుము తదితర పంటలు సాగుచేసి వాటిని కలియదున్నితే భూసారం పెరిగి దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది. భూసార పరీక్షలు చేయించి, జింక్ వంటి సూక్ష్మ పోషకాలు వినియోగించడం ద్వారా రైతులకు మేలు చేకూరే అవకాశం ఉంటుంది. అయితే రైతులు అవగాహన లేమితో ఎరువులను, ముఖ్యంగా యూరియాను అతిగా వాడుతున్నారు. ఏపంటకు ఎంతమేర ఎరువులు వినియోగించాలన్న విషయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

ఏ పంటలకు ఎంత ఎరువులు వినియోగించాలన్న విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామస్థాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే, పెట్టుబడి భారం తగ్గడంతో పాటు, దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది.

- సుధాకర్, ఏడీ, వ్యవసాయశాఖ

సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణపై రగడ

- రెండు వర్గాల మధ్య విభేదాలు
- స్టేషన్‌కు చేరిన పంచాయితీ



ఆసుపత్రి ఇన్‌గేటు వద్ద అస్తవ్యస్తంగా హనాలు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణ కోసం అధికార పార్టీలో రెండు వర్గాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇరువర్గాలు పరస్పరం వాగ్వాదానికి దిగి రోడ్డుకెక్కారు. కర్నూలు జీజీహెచ్‌లో 238 మంది సెక్యూరిటీ గార్డుతో తిరుపతికి చెందిన ఈగల్ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. అయితే నాయకుడు ఈ ఏజెన్సీని సబ్‌లీజ్ కింద తీసుకుని రెండు నెలలు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఈ విషయంలో రెండు వర్గాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. తామే ఏజెన్సీని నిర్వహిస్తామని ఓ ప్రజా ప్రతినిధి అనుచరులు కొందరు సోమవారం సెక్యూరిటీ ఆఫీస్‌కు వచ్చి గొడవకు దిగారు. ఇప్పటికే సెక్యూరిటీ ఏజెన్సీ సబ్ లీజు కోసం తాము లక్షల రూపాయలు ఖర్చు పెట్టామని ఏజెన్సీని నిర్వహిస్తున్న ఓ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుచరులు వాదనకు దిగారు. తాము ఈగల్ సంస్థతో అగ్రిమెంటు చేసుకున్నామని, ఖర్చు పెట్టి ఉంటే చెల్లిస్తామని ఇక నుంచి తామే విధులు చూస్తామని ప్రజాప్రతినిధి అనుచరులు అన్నారు. దీంతో సెక్యూరిటీ ఆఫీసు వద్ద కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న నాయకుడి అనుచరులు భారీ స్థాయిలో ఆఫీసుకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. తర్వాత ఈ విషయం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. కర్నూలు జీజీహెచ్‌లో సెక్యూరిటీల వ్యవస్థ గత 2 నెలలుగా అస్తవ్యస్తంగా తయారయింది. ఐదు రోజుల క్రితం ఇన్‌గేటు వద్ద సెక్యూరిటీ గార్డులు ట్రాఫిక్‌ను నియంత్రించలేకపోవడం ముగ్గురిపై హాస్పిటల్ సూపరింటెండెంట్ వేటు వేశారు. ఇద్దరు అధికార పార్టీ నేతలు సెక్యూరిటీ ఏజెన్సీ కోసం కొట్టుకోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అధికారులు కూడా ఈ ఇద్దరి నేతల మధ్య తలదూర్చకపోవడంతో హాస్పిటల్ రోగుల భద్రత అదుపు తప్పింది.

రైతులను విస్మరించిన ప్రభుత్వం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులను విస్మరించిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక టమోటా, ఉల్లిరైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కర్నూలు ఉల్లి పంటను అమ్ముకుందామంటే రైతులకు నిరాశే మిగిలిందన్నారు. నగర శివారు మునగాలపాడు వద్ద వేయి ఉల్లి బస్తాలను పడేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినిమాలు, నారా లోకేశ్ ఢిల్లీ చుట్టూ, చంద్రబాబు పింఛన్ పంపిణీ చేయడానికి బిజీ బిజీగా తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అన్ని వర్గాలకు మేలు చేయాలని, లేనిపక్షంలో బంగ్లాదేశ్, నేపాల్ ప్రజలు ఎలా తిరగబడ్డారో అలాగే ఏపీలో కూడా జరుగుతుందన్నారు. కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, జుబేర్ అహ్మద్, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 22 నుంచి కార్తీక మాసోత్సవాలు : ఈవో



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో అక్టోబరు 22 నుంచి నవంబరు 21వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు. సోమవారం పరిపాలన భవనంలోని అర్చకులు, సిబ్బందితో కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, ఆలయ వేళలు, స్వామిఅమ్మవార్ల ఆర్జితసేవలు, క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ తదతర అంశాలపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్ని విభాగాలను ఆదేశించారు. డిప్యూటీ ఈవో రమణమ్మ పాల్గొన్నారు.

హంద్రీకి కొనసాగుతున్న నీటి విడుదల



విడుదలవుతున్న నీరు

గోనెగండ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి సోమవారం సాయంత్రం 600 క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి అధికారులు విడుదల చేశారు. నాలుగైదురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 4 టీఎంసీల వరద చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం రాత్రి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో గేట్లను మూసివేశారు. అయితే సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. ఈ కారణంగా సోమవారం సాయంత్రం జీడీపీ ఏఈ మహమ్మద్‌ఆలీ 4వ గేటును ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని దిగువ హంద్రీనదికి విడుదల చేసినట్టు తెలిపారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు 4వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో కొసాగింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, దేవకొండ, పత్తికొండ, ఆస్పరి, తుగ్గలి ప్రాంతాలలో వర్షాలు కురియడంతో వరద నీరు వచ్చి జీడీపీని చేరుతోంది.

మెగా డీఎస్సీలో 2,590 పోస్టులు భర్తీ

- ఉమ్మడి జిల్లాలో అర్హులు లేక భర్తీ కాని పోస్టులు 88



కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా తుది జాబితాలో మొత్తం 2,590 ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇందులో అర్హత గల అభ్యర్థులు లేక 88 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 2,678 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆన్‌లైన్ పరీక్ష అనంతరం గతనెల 23న ప్రభుత్వం ఫలితాలను ప్రకటించింది. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటించింది. యాజమాన్యాల వారీగా పోస్టుల భర్తీ ఇలా ఉంది.. ప్రభుత్వ యాజమాన్యాల విభాగంలో నోటిఫై చేసిన పోస్టులు 2,547 కాగా, భర్తీ చేసిన పోస్టులు 2483. అర్హత గల అభ్యర్థులు లేక 64 పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. మున్సిపల్ కార్పొరేషన్ విభాగంలో నోటిఫై చేసిన పోస్టులు 58 కాగా, 51 భర్తీ అయ్యాయి. 7 పోస్టులు అభ్యర్థులు లేక మిగిలిపోయాయి. అలాగే మున్సిపాలిటీలో 40 పోస్టులకు గానూ 28 పోస్టులు భర్తీ చేయగా.. 12 పోస్టులు మిగిలిపోయాయి. ట్రైబల్ వెంచు విభాగాలకు సంబంధించి 33 పోస్టులకు గానూ 28 పోస్టులు భర్తీ అయ్యాయి. అభ్యర్థులు లేక 5 పోస్టులు మిగిలిపోయాయి. అర్హత గల అభ్యర్థులు లేకపోవడం వలన ఆయా కేటగిరిలో మిగిలిన 88 పోస్టులను వచ్చే ఏడాది డీఎస్సీలో భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యర్థుల ప్రశ్నల నివృత్తికి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తాత్కాలిక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ నెంబర్.9440589315, 9440561831, 998504 7704ను సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సీఎం చంద్రబాబు ఈనెల 19న విజయ వాడలో నియామక పత్రాలు అందజేస్తామన్నారు. జిల్లాలో ఎంపికైన అభ్యర్థులందరూ గతంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసుకున్న సెంటర్లకు ఈనెల 18న ఉదయం 7 గంటలకు రిపోర్టు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా విజయవాడకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులతో పాటు తోడుగా ఒకరిని విజయవాడకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా అభ్యర్థులు 18వ తేదీన ఉదయం 7 గంటలకు తప్పక రిపోర్టు చేసుకోవాలని పేర్కొన్నారు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

రోవేదన

ఆసుపత్రిలో వేధిస్తున్న టెక్నీషియన్ల కొరత

ఇబ్బంది పడుతున్న రోగులు

పట్టించుకోని అధికారులు



ఎక్సరే కోసం స్ట్రెచ్చర్‌పై వేచి ఉన్న రోగి

నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్సరే టెక్నీషియన్ల కొరత వేధిస్తోంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరిగింది. ఎక్కువ సంఖ్యలో నిమోనియాతో రోగులు వస్తున్నారు. వారికి ఎక్సరే అవసరం. అయితే ఆసుపత్రిలో మూడు మిషన్లు ఉన్నా టెక్నీషియన్ మాత్రం ఒక్కరే ఉన్నారు. దీంతో రోజు 130 మంది దాకా ఎక్సరే తీసేందుకు గంటల కొద్ది సమయం పడుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమ, బుధ, శనివారాల్లో అయితే దాదాపు 200 మందికి ఎక్సరే తీయాల్సి వస్తోంది. కొంత మంది వేచిచూడలేక ప్రైవేటు ఆసుపత్రుల్లో తీయించుకుంటున్నారు. టెక్నీషియన్లు లేకపోవడంతో కొన్నేళ్ల నుంచి ఎక్సరే మిషన్ మూలన పడింది. టెక్నీషియన్లను నియమించాలని అనేక సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై హెచ్‌వోడీ డాక్టర్ హరినాథ్‌ను వివరణ కోరగా ఎక్సర్ కోసం రోగులు పడుతున్న ఇబ్బందులు వాస్తవమే. అయితే టెక్నీషియన్ ఒకరే ఉండడంతో ఎక్కువ మందికి తీసేందుకు కొంత సమయం పడుతుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

\- నంద్యాల హాస్పిటల్



టెక్నీషియన్లు లేక మూలన పడ్డ ఎక్సరే మిషన్



ఎక్సరే కోసం బారులుదీరిన రోగులు

పది, ఇంటర్‌లో వంద శాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కృష్ణవేణి

మహానంది, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ స్కూల్ రాష్ట్ర విద్యా శాఖ పరిరక్షణ అధికారి కృష్ణవేణి అన్నారు. సోమవారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని మోడల్ స్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ రాష్ట్ర విద్యా విషయక సహాయ పర్యవేక్షణాధికారి సలీంబాషా, ఎంఈవో రామసుబ్బయ్య పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి

మహానంది, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి మహానంది మండలం మసీదుపురంకు చెందిన టీడీపీ నాయకుడు నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి రూ.10,116 విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయ ప్రాంగణంలోని విరాళా ల కౌంటర్‌లో పర్యవేక్షకుడు నీలకంఠ రాజుకు ఆయన నగదును అందచే సి అన్నదానం బాండుతో పాటు స్వామి వారి ప్రసాదాలను అందుకున్నారు. అలాగే నంద్యాలలోని నూనెపల్లెకు చెందిన రమాదేవి రూ.10,116 అన్నదాన పథకానికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అన్నదాన ఇన్‌చార్జి రామశివ, టీడీపీ నాయకులు రాముడుగౌడ్, హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

బండిఆత్మకూరు సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాడి పోశకులు తమ పశువులకు గాలి కుంటు టీకాలు విధిగా వేయించాలని పశువైద్యాధికారులు అనూష, జ్యోత్స్న సూచించారు. సోమవారం మండలంలోని శింగవరం, బండిఆత్మకూరు గ్రామాల్లో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. కార్యక్రమంలో మాబాషా, సాయిచందు, గోవిందు, పాపిరెడ్డి, జయశ్రీ, అర్జున్, సతీష్, శివశంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారుతీనగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించకపోతే రిలేనిరాహారదీక్షలు చేపడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం నందికొట్కూరు మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాల ముందు కాలనీ వాసులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తాగునీరు, డ్రైనేజీలు, రేషన్‌కార్డుల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, బెస్తరాజు, ఉస్మాన్‌బాషాలతోపాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

జూపాడుబంగ్లా సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చునని డిప్యూటీ తహసీల్దార్లు సత్యదీప్, నాగన్న, సీనియర్ అసిస్టెంట్ సరళమ్మ అన్నారు. 80బన్నూరు, తరిగోపుల, లింగాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం పండించిన టమోటా, పచ్చిమిర్చి, ఆకుకూరలు గోంగూర, పాలకూరలను సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. వీటిని పరిశీలించి పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జీ అంజనమ్మ, పొదుపు మహిలలు జయమ్మ, పార్వతీ, రాధిక, వెంకటశేషమ్మ పాల్గొన్నారు.

అద్దె బస్సుల డ్రైవర్లకు జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న రామ్‌నాయక్

ఆత్మకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలోని అద్దె బస్సులకు డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి జీతాలు పెంచడంతో పాటు ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. అనేక ఏళ్లుగా ఆర్టీసీలో అద్దెబస్సుల డ్రైవర్లుగా పనిచేస్తున్నప్పటికి వారి ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు పనిదగ్గ ఫలితం కల్పించడం లేదని చెప్పారు. ఉచిత బస్సు సదుపాయం వల్ల పనిభారం కూడా అధికమైందని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మౌలాలి, వెంకటేష్, రాముడు, జనార్దన్, షాకీర్, సుబ్బన్న, నాగరత్నం, రాజేష్ తదితరులు ఉన్నారు.

అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- గడువులోగా పరిష్కరించాలి
- డీఆర్వో రామునాయక్
- బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో రామునాయక్

నంద్యాల ఎడ్యుకేషన్/ నూనెపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఆర్‌వో రామునాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఆర్‌వో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే సమస్యలను ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీదారునికి రసీదు ఇవ్వడంతో తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు.

మూడేళ్లైనా పింఛన్ రాలేదు

నాది బనగానపల్లి మండలంలోని పసుపుల గ్రామం. నా భర్త మూడేళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి ఎన్నిసార్లు పించనుకు దరఖాస్తులు చేసుకున్నా రాలేదు. నాకు ఒక కుమారుడు ఉన్నాడు. పించను డబ్బులు వస్తే ఆసరాగా ఉంటుంది.

● మద్దమ్మ, వితంతువు

మా పొలం లీజుకిచ్చారు



మాది బనగానపల్లి మండలంలోని ఎర్రగుడి గ్రామం. దాదాపు 35 మంది రైతులకు చెందిన 89.90 ఎకరాల భూమిని మాకు తెలియకుండానే జయజ్యోతి(ప్రస్తుతం మహాసిమెంట్) కంపెనీ వారికి లీజుకిచ్చారు. ఒక రైతు గతేడాది తన పొలాన్ని ఇతరులకు అమ్మగా రిజిస్ట్రేషన్ చేసేందుకు వెళ్లగా ఈ పొలం మీది కాదని చెబుతున్నారు. ఇదే మాదేనని ఎమ్మార్వో, వీఆర్వోలను అడగగా 2012 నుంచి జయజ్యోతి కంపెనీ మీద ఉందని చెబుతున్నారు. న్యాయం చేయాలని కోరుతున్నాం.

● రైతులు, ఎర్రగుడి

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

మేము 35 ఏళ్ల నుంచి రుద్రవరం మండలంలోని చిన్నకంబలూరులో నివాసం ఉంటు న్నాం. కొన్నేళ్లుగా అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ వ్యక్తులు మా ఇంటిని ఆక్రమించుకోవ డానికి ప్రయత్నించారు. పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయాల్లో ఫిర్యాదు చేయగా ఎలాంటి స్పందనరాలేదు. దీంతో హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా మాకు సానుకూలంగా స్పందించింది.

● నాగేంద్ర, చిన్నకంబలూరు, రుద్రవరం

సదరం సర్టిఫికెట్ ఇవ్వడం లేదు



నాది ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామం. నాకు మూడేళ్ల కిందట రోడ్డు ప్రమాదమైంది. రెండు కాళ్లు విరిగాయి. సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నా. వైద్య పరీక్షలకు వెళ్లాను. ఇంతవరకు నాకు సదరం సర్టిఫికెట్ రాలేదు. ఎందుకని ప్రశ్నించగా సరైన సమాధానం రావడం లేదు.

● బషీర్ అహ్మద్, కురుకుంద

బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వెలుగోడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బేడ, బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని బుడగజంగాల నాయకులు కోరారు. సోమవారం ఎమ్మెల్యేను కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బేడ బుడగ జంఘాల అధ్యక్షులు తిక్కారి మల్లికార్జున, మోటే మల్లయ్య, శంకర్, చంద్రశేఖర్, బుగ్గ రాముడు, శిరీష, జమ్మన్న, సాయి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొత్తపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి-బావాపురం గ్రామాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శివ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన మాదిగ శివ అనే వ్యక్తి ఆత్మకూరు నుంచి స్వగ్రామమైన గువ్వలకుంట్లకు బైక్‌పై వస్తుండగా.. కొత్తపల్లి-బావాపురం గ్రామాల మధ్యలో బైక్‌పై నుంచి అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

చెక్కు పంపిణీ



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన శ్రీనితకు రూ.5,26,000 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సురేంద్ర, పైపాలెం వెంకటయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నకాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది

ఆత్మకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని ఎలక్ట్రికల్ ఆత్మకూరు డివిజన్ జేఏసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, రామదాసు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేయడంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే హెల్త్‌కార్డులను మంజూరు చేసి వైద్యఖర్చులను ప్రభుత్వమే భరాయించాలని అన్నారు. అలాగే కారుణ్య నియామకాల్లో నామమాత్రమే వేతనాలు ఇవ్వడం సరికాదని అన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్ -2 సిబ్బందికి అదనపు విధులు కేటాయించడం అన్యాయమని అన్నారు. ఆయా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు.

శ్రీశైలంలో వెండి రథోత్సవం



వెండి రథం లాగుతున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలం,సెప్టెంబరు 15, (ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్రంలో భ్రమరాంబ,మల్లికార్జున స్వామివార్లకు సోమవారం సేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఉభయ దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు సహస్ర దీపార్చన జరిపారు. అనంతరం ఉభయ దేవాలయ ప్రాంగణంలో స్వామిఅమ్మవార్లను వెండిరథోత్సవంలో ఊరేగించారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, పండితులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం



నంద్యాలలో రక్తదానం చేసిన సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఈఈ నాగరాజు



శాంతిరాం కళాశాలలో మోక్షగుండం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కళాశాల చైర్మన్

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని ఆయన బాటలో పయనించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు మంచిపేరు తీసుకురావాలని యువ ఇంజనీర్లకు ఆ శాఖ ఈఈ నాగరాజు దిశానిర్దేశం చేశారు. సోమవారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో ఇంజనీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్ఈ రాష్ట్ర నాయకులు బి.వంశీధర్, జిల్లా అధ్యక్షుడు పి.సంతోష్‌రెడ్డి, జనరల్ సెక్రటరి బాబాఫక్రుద్దీన్, ట్రెజరర్ కె.కరిముల్లా, మహిళా కార్యదర్శి దేవిప్రియ, జిల్లా నాయకులు సుకుమార్, వెంకటేశ్‌లను ఈఈ నాగరాజు, ఏపీపీఆర్ ఈఏ రాష్ట్ర జాయింట్ సెక్రటరి సుధాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు, ఏపీపీఆర్‌డీఈఈఏ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, డీఈఈలు పాల్గొన్నారు.

పాణ్యం: మండలంలో ఇంజనీర్స్‌డే సందర్భంగా ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శాంతిరాముడు, డీన్ అశోక్‌కుమార్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

చరిత్రలో నిలబడేలా ఏపీ అభివృద్ధి



మాట్లాడతుఉన్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

నంద్యాల రూరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్రలో నిలబడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు, ఎమ్మెల్యే సోదరుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ సీఎం ఓ విజన్ ఉన్న నాయకుడని, పారిశ్రామికవేత్తలు సైతం ఆంధ్రవైపు మొగ్గుచూపేలా ఓ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నాడన్నారు. ఎన్నికల సమయంలో హామీల మేరకు 20 లక్షల ఉద్యోగాలిస్తానని చెప్పి నేడు డీఎస్సీని సైతం విడుదల చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. మాజీ సీఎంకు బుద్ధిమందగించి కూటమి ప్రభుత్వంపై కుట్రలు పడుతున్నారన్నారు. జిల్లాకు చెందిన ఓ యువ వైసీపీ నాయకుడు మొన్న మిథున్‌రెడ్డిని కలిసి నారా లోకేశ్ గారి ఎదుగుదలకు అడ్డమవుతున్నాడనే మిథున్‌రెడ్డిని అరెస్టు చేపించారని మాట్లాడిన మాటలు వింటే ఆహ్లాదకరంగా ఉందన్నారు. నీకు లోకేశ్ అన్నను మాట్లాడేంతస్థాయి లేదన్నారు. నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకొచ్చిన ఘనత మంత్రి లోకేశ్‌కే దక్కుతుందన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న రమేష్ కుమార్

కొత్తపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నుంచి సంగమేశ్వరం వరకు గుంతలమయమైన రహదారికి మరమ్మతు లు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సింగరాజుపల్లిలో రమేష్ కుమార్ మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలోని ఆత్మకూరు-సంగమేశ్వరం, ఆత్మకూరు-దుద్యాల, గువ్వలకుంట్ల-పాలెంచెరువు రోడ్లు గుంతలమయ మై ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్ర హం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరాయుడు, నక్కస్వాములు, జ్ఞానసూర్యుడు, దాసు పాల్గొన్నారు.

'మెడికల్ కళాశాల గ్రాఫిక్స్ కాదు'



కళాశాలలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల మెడికల్ కళాశాల గ్రాఫిక్స్ కాదని.. ఇది మాజీ ముఖ్యమంత్రి జగన్ కట్టించిందేనని, వాస్తవాలు హోంశాఖ మంత్రి అనితకు కనిపించడం లేదా? అని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రశ్నించారు. నంద్యాల మెడికల్ కళాశాలలో సోమవారం వారు మాట్లాడారు. వైసీపీ అధికారంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు అడుగులు వేసి 2023 కంతా 5 కళాశాలలను పూర్తి చేశామన్నారు. ఆ ఐదు కాలేజీల్లో గత రెండేళ్లుగా విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఇందుకు నంద్యాలలోని కళాశాలనే సాక్ష్యమని తెలిపారు. చారిత్రక ఆధారాలున్నవాటిని కాదని మంత్రి అనిత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మెడికల్ కళాశాలల ఆనవాళ్లు లేవని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాయ చేశాడని హాస్యాస్పదంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం వారు కళాశాల ప్రారంభించి రెండేళ్లయిన సందర్భంగా కేకు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ అధ్యక్షుడు పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పగిడ్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేంద్ర కుమార్ తెలిపారు. పగిడ్యాలలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో సుబాన్‌తో కలిసి ఎంపీడీవో సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లికార్జున రెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం



రాజశేఖర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న బైరెడ్డి

పగిడ్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పి. రాజశేఖర్‌రెడ్డి (72) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మృతదేహం పై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అలాగే వైసీపీ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి మృతదేహనికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆల్లీవుసేన్, దశరథరామిరెడ్డి, అజీమ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా నృసింహ స్వామి ఆలయ మండల పూజలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ నృసింహ కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ మండల పూజలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పునఃప్రతిష్ఠ వేడుకలు జరిగి 41రోజులు కావడంతో మండల పూజలు చేశారు. అహోబిలం ఆలయ పండితులు స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక హోమాలు జరిపారు. స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కొలిమిగుండ్ల సహకార సంఘం చైర్మన్ అంబటి వివేకానందరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జాతీయభాషా హిందీని మరువకూడదు

చాగలమర్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ భాషా హిందీని మరువకూడదని హెచ్‌ఎం శివలక్ష్మి తెలిపారు. సోమవారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో హిందీభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయురాలు షఫిరూన్‌ను సన్మానించారు.

బేతంచెర్ల: బేతంచెర్లలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో సోమవారం హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. హిందీ నేర్చుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ దేవేంద్ర కుమార్ సూచించారు. చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు ఇచ్చారు. హిందీ ఉపాధ్యాయులు నాగేంద్ర గుప్తా, ప్రశాంతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతించిన పాలేరు వాగు

- యథావిధిగా వాహనాల రాకపోకలు
- వరి మళ్లలో నిలిచిన వరద నీరు


పాలేరు వాగుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సు


నీట మునిగిన వరి మళ్లు

సంజామల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరువాగు సోమవారం నాటికి శాంతించింది. వాగు ప్రవాహం తగ్గడంతో కోవెలకుంట్ల నుంచి సంజామల మీదుగా తాడిపత్రికి, కోవెలకుంట్ల నుంచి ముదిగేడు మీదుగా తాడిపత్రి , అనంతపురం వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆటోలు, ద్విచక్రవాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా గమ్య స్థానాలకు చేరుకున్నారు. భారీ వరదకు ముంపునకు గురైన వరిమళ్లు చెరువులను తలపిస్తున్నాయి. వరిమళ్ల నుంచి నీరు బయటకు వెళ్లకపోవడంతో పంట కుళ్లిపో తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికందే అవకాశం లేదంటూ రైతులు లబోదిబోమంటున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

బనగానపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని నందవరం గ్రామంలో బనగానపల్లె రైతు సంఘం రెండవ సభలు రైతు నాయకుడు మహేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ కార్పొరేట్ విధానాల వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు పంటలకు మద్దతు ధరలు అమలు చేయడం లేదన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ. కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నారన్నారు. యూరియా సకాలంలో అందడం లేదన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా శేషారెడ్డి, అధ్యక్షుడిగా వద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా మహేశ్వరరెడ్డి, వెంకట సుబ్బయ్య, సహాయ కార్యదర్శులుగా శివకృష్ణ, రంగారెడ్డి, చింతామణి, రజాక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుబ్బరయాఉడు రామచ్రందుడు, ప్రసాద్ శ్రీనివాసులు, శిల్పిసుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

20న రాయలసీమ దేవసేవకుల సదస్సు

- బైబిల్ మిషన్ ఏవో బందెల రాజు

డోన్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల దేవసేవకుల (చర్చి పాస్టర్లు) సదస్సును ఈనెల 20న నిర్వహించనున్నట్లు బైబిల్ మిషన్ ఏవో రెవరెండ్ బందెల రాజు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో దేవ సేవకుల సదస్సుకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బందెల రాజు మాట్లాడుతూ సదస్సులో ప్రజల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు తెలిపారు. రాయలసీమ జిల్లాల నుంచి దేవసేవకులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో దైవ సేవకులు సోల్మాన్, దేవదాసు, రాజ్‌కుమార్, మాణిక్యం రాజు, సామేల్, ఆదాం, ఇసాక్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కొత్తపల్లి ఆయుష్మాన్ కేంద్రానికి గుర్తింపు

డోన్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వైద్య సేవలు అందించినందుకు మండలంలోని యు.కొత్తపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ మేరకు నేషనల్ హెల్త్ రీసోర్స్ సెంటర్ ప్రత్యేక బృందం సర్టిఫికెట్లను జారీ చేశారు. ఆయా అంశాలలో 91.35శాతం మెరుగైన వైద్య సేవలు అందించినందుకు గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ వైవిద్య ఏఎన్‌ఎం సుజాత, ఆశావర్కర్ రంగలక్ష్మిని అభినందించారు.

తీరనున్న నీటి కష్టాలు

డోన్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లెలో నీటి కష్టాలు తీరనున్నాయి. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి చొరవతో ఓర్వకల్లు రిజర్వాయరు నుంచి నీటిని వెంకటనాయునిపల్లె గ్రామానికి పైపులైన్ల ద్వారా అందించనున్నారు. సోమవారం గ్రామ ప్రధాన రక్షిత మంచినీటి పథకానికి అనుసంధానంగా ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీశారు. పనులను సర్పంచ్ శీలం చంద్రశేఖర్ నాయుడు పరిశీలించారు. డిసెంబరులోగా పైపులైన్ పనులు పూర్తి చేసి నీటిని అందిస్తామన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేస్తున్నట్లు పశువైద్యశాల ఇన్‌చార్జి పశువైద్యాధికారి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బెలుం, అబ్దులాపురం గ్రామాల్లో పశువులకు పశువైద్య సిబ్బంది టీకాలు వేశారు. పశుపోషకులు గాలికుంటు టీకాలను తప్పనిసరిగా పశువులకు వేయించాలని ఆయన సూచించారు.

చాగలమర్రి: గ్రామంలో పాడి రైతులు పశువుల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. సోమవారం చాగలమర్రి 1వ సచివాలయ పరిధిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముత్యాలపాడు, చిన్నవంగలి గ్రామాల్లో పశువైద్యులు సాయిబాబా, దీపకుమారి టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మహబూబ్‌బాష, నవీన్, మాబుషరీఫ్ పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి: ఎంఈవో

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో అబ్దుల్ కలాం ఆదేశించారు. మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. పాల్ ల్యాబ్ సెంటర్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రికార్డులు, వంటగది, నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరులో మార్పు రాకపోతే చర్యలు తప్పవని ఎంఈవో హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్పీ రాజేష్, ఎస్‌వో, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ ప్రధాన సమస్యలను పరిష్కరించాలని గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగులు కోరారు. సోమవారం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మహిళపై కోతి దాడి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళపై కోతి దాడి చేసింది. ఈ ఘటన మండలంలోని కంపమల్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఇంటి బయట కూర్చున్న శ్రీరాముల అంకమ్మపైన కోతి విచక్షణారహితంగా దాడి చేసింది. ఆమె కేకలకు సమీపంలోని మహిళలు కోతిని తరిమి స్థానిక ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. ఈ దాడిలో పిల్లలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కోతులను పట్టి ఆడవుల్లో వదలాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటు

శిరివెళ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్లలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ ల్యాబ్‌లను గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగసువర్చల సోమవారం ప్రారంభించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ల్యాబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవింద రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక అదృశ్యం అయినట్లు ఎస్‌ఐ రామిరెడ్డి సోమవారం తెలిపారు. బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ఆచూకీ లభించలేదు. దాంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు న మోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సర్వే వేగవంతం చేయండి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి ఉన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే


విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

బనగానపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఇంజనీర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. తాపీమేస్త్రీల సంఘం గౌరవ అధ్యక్షుడు మగ్బుల్‌బాషా ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మగ్బుల్‌బాషా మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు అమోఘమన్నారు. ప్రతి ఇంజనీరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిమెంట్ డీలర్ మహబూబ్‌వలి, నయీమ్, రవి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని బైరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన 12వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో డోన్ పట్టణం చెందిన రామ్స్ పాఠశాల కరాటే విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం విజేతలకు కరాటే ఇండియా ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కీర్తన్ కొండ్రు పతకాలను అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకుడు భాస్కర్‌రావు కోరారు. సోమవారం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా నల్లబ్యాడ్జీలతో కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ సురేష్‌బాబు, లైన్‌మెన్లు శేఖర్, శ్రీనివాసులు, ఖలీల్, కాంట్రాక్టు కార్మికులు, సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మొబైల్ వినియోగదారులు ఏపీకే ఫైల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని సీఐ మద్దినేని రమేష్‌బాబు సూచించారు. మొబైల్ ఫోన్ వాడకం విస్తృతంగా పెరిగినందున సైబర్ నేరగాళ్లు పెరిగిపోయారన్నారు. గ్రూపుల్లో విచ్చలవిడిగా షేర్ అవుతున్న ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేస్తే మీ మొబైల్ హ్యాక్ కావడంతో పాటు, బ్యాంకులో నగదును కొట్టేస్తారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయరాదని సీఐ సూచించారు.

ఉమామహేశ్వరస్వామి పల్లకీసేవ


స్వామివారి పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో పల్లకీసేవ ఉత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉమామహేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి భక్తులు స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పాండురంగారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాగు నీటి సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మృతి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల సద్దల వెంగన్న చెరువు సాగునీటి సం ఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. కాగా, వారంరోజుల క్రితం ఆయన తమ్ముడు లక్ష్మీనారాయణరెడ్డి మృతి చెందాడు. తమ్ముడు చనిపోయాడన్న దిగులుతో అప్పటికే కొంత అనారోగ్యంగా ఉన్న గోపాల్‌రెడ్డి మృతి చెందారు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గోపాల్‌రెడ్డికి ఒక కొడుకు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్‌ఎం శివలక్ష్మి అన్నారు. సోమవారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాల బాలికలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యానికి హానికరమైన పొగాకు, మద్యం, ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి అన్నారు. సోమవారం దొర్నిపాడు జడ్పీహైస్కూల్ విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు దేవేంద్ర, ఉపాధ్యాయులు రమణయ్య, చెన్నయ్య, మౌలాలి, నాగరాజు, కవిత, శ్యామల, పూర్వ విద్యార్థులు మనోజ్, జాఫర్ ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

దొర్నిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు సహకార సంఘం సొసైటీ ఆవరణలో చైర్మన్ సిద్ధి సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా కొరత లేదన్నారు. సీఈవో సైపుల్లాబేగ్, చిన్నయ్య, రైతులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

దొర్నిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీవో సావిత్రి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఆయాశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పుస్తకావిష్కరణ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దసరా ఉత్సవాల ఆహ్వాన పుస్తకాన్ని ఆలయకమిటీ సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి అహరిష్‌బాబు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అక్టోబరు 3వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఉన్నారు.

రుద్రవరం: రుద్రవరం కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం దసరా నవరాత్రుల ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చోళవేటి సూర్యనారాయణ, పెరుమాల్ల నరసయ్య పాల్గొన్నారు.